క్లుప్తంగా

రెండు బైకులు ఢీ వ్యక్తి దుర్మరణం

దుర్గి: ఎదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మండల పరిధిలోని ముటుకూరు గ్రామానికి చెందిన నర్రా నరసింహారావు (60) దుర్మరణం చెందారు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు జెసిబి వాహనాన్ని నిర్వహిస్తూ జీవనాన్ని సాగించే నరసింహారావు వెల్దుర్తి మండలం, రచ్చమల్లపాడులో జెసిబి పని పూర్తి చేయించి బైకు పై ఇంటికి వెళ్తుండగా మండాది ప్రధాన రోడ్డు పై వెల్దుర్తి నుంచి వస్తున్న బుల్లెట్ వాహనం మృతుని బైకు ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికుల సహాయంతో మెరుగైన చికిత్స కోసం నర్సరావుపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుని కుటుంబాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులు పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

మార్కెట్ యార్డులో ధాన్యం బస్తాలు చోరీ

పిడుగురాళ్ల: మార్కెట్‌యార్డులో రైతు ధాన్యం బస్తాలు చోరీకి గురైనట్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదు అయింది. పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని వీరాపురం గ్రామానికి చెందిన వల్లభనేని శివ కుమార్ గత రెండు నెలల క్రితం పట్టణంలోని మార్కెట్ యార్డులో ఓపెన్ షెడ్‌లో 620 ధాన్యం బస్తాలను నిల్వ చేశాడు. ప్రతి రెండు రోజులకు ఒక సారి ధాన్యం బస్తాలను చూసుకుంటూ వెళ్లేవాడు. ఈ క్రమంలోనే సోమవారం ధాన్యం బస్తాలను పరిశీలించడంతో 45 ధాన్యం బస్తాలు తగ్గాయి. ఎవరో దుండగులు ధాన్యం బస్తాలు దొంగలించారని గుర్తించిన వల్లభనేని శివకుమార్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రైతు ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

ఆహుతైన ఇళ్లు

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామం ఎస్టీ కాలనీలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు కుటుంబాలకు చెందిన వారు సర్వస్వం కోల్పోయి భారీగా ఆస్తి నష్ట వాటిల్లింది. కాలనీకు చెందిన ఇండ్ల అంకమ్మరావు, తలుపుల సుధాకర్ ఇరువురు నివాస గృహాల్లో వంట చేస్తుండగా ఆదివారం ప్రమాదవశాత్తు మంటల వ్యాపించి రెండు ఇళ్లు అహుతయ్యాయి. ఈ ప్రమాదంలో ఒకరి ఇంట్లో రెండు సవర్ల బంగారం, రూ. 50 వేలు నగదు అగ్నికి అహుతి అయ్యాయి. తహసీల్దారు షేక్ జాన్‌సైదులు సూచనల మేరకు రెవెన్యూ సిబ్బంది బాధితులు ఒక్కొక్కరికీ 10 కేజీల బియ్యం అందజేశారు. ఆయనతో పాటు సర్పంచ్ బోడాల వీరాంజినేయులు, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, వీఆర్వో వేణుగోపాలపావు పాల్గొన్నారు.

పౌరాణిక పద్య పోటీలకు రండి

వినుకొండ టౌన్: స్థానిక జాషువా కళా ప్రాంగణంలో మహాకవి, కవికోకిల గుర్రం జాషువా 52వ వర్ధంతి కార్యక్రమాన్ని, జాషువా సాంస్కృతిక సమాఖ్య సౌజన్యంతో జీవనజ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు మందా వెంకట్రావు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గురజాల ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తిని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలసి, కార్యక్రమాలకు హాజరు కావాలంటూ ఆహ్వానించడం జరిగిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని కళాకారులు ఈ పోటీలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట కార్యదర్శి సురభి దేవ సహాయం, నెల్లూరు కు చెందిన ప్రజా జ్యోతి చైతన్య కళావేదిక చైర్మన్ కె. రమణ శ్రీ, కొత్త సాగర్ బాబు పాల్గొన్నారు.

మూడు ఆటోలు సీజ్

నరసరావుపేట టౌన్: పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వస్తున్న మూడు ఆటోల ను సీజ్ చేసినట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు సోమవారం తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు జరిమానా విధించామన్నారు. ఓవర్‌లోడ్‌తో వస్తున్న మూడు ఆటోలను సీజ్ చేశామన్నారు. చర్యల నిమిత్తం రవాణ శాఖకు సిఫార్స్ చేసినట్లు సీఐ తెలిపారు. నిబంధనలకు లోబడి వాహనదారులు నడుచుకోవాలన్నారు.

50 కుటుంబాలకు పైగా కల్యాణ కానుక

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గంలో పేద ఆడ బిడ్డలకు అండగా ఉండి పార్టీలకు, కులమతాలకు అతీతంగా చేపట్టిన కల్యాణ కానుక ఇప్పటికే 50 కుటుంబాలకు పైగా అందించడం జరిగిందని చింతలపూడి చారిట్రబుల్ ట్రస్టు, పల్నాడు హాస్పటల్ అధినేత డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చింతలపూడి చారిట్రబుల్ ట్రస్టు, పల్నాడు హాస్పటల్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కల్యాణ కానుకకు విశేష స్పందన ఉందన్నారు. పల్నాడు ప్రజలు ఈ కానుకను మరింతగా ఉపయోగించుకోవాలని చింతలపూడి సోదరులు సూచించారు. తమ వెంట నిలబడి కార్యక్రమానికి సహకరిస్తున్న ట్రస్టు సభ్యులు, చింతలపూడి బ్రదర్స్ అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

ఎంపీపీ దాసరి చౌడేశ్వరి



సర్టిఫికెట్‌ను పంపిణీ చేస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు

పాలువాయిగేటు(రెంటచింతల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఒక వరం జగనన్న సురక్ష అని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని పాలువాయి గేటు గ్రామంలో ఇన్‌చార్జి సర్పంచ్ చింతా సుబ్బారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లను క్షేత్రస్థాయిలోనే ఉచితంగా పొందవచ్చన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలతో పాటు గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ జగనన్న సురక్ష ద్వారా అందించే సేవలను ప్రజలకు ఉచితంగా అందించడానికి అన్ని రకాల చార్జీలను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందని తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు తెలిపారు. జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ, రైస్‌కార్డు, కుల, ఆదాయ తదితర మొత్తం 52 ధృవీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమలో ఇన్‌చార్జి సర్పంచ్ చింతా సుబ్బారావు, మండల సచివాలయాల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, ఈఓపీఆర్డీ సీహెచ్ రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, కార్యదర్శి జి.అనంత కోటేశ్వరరావు, వివిధ శాఖాధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష నిరుపేదలకు రక్ష

గురజాల : జగనన్న సురక్ష నిరుపేదలకు రక్షగా ఉందని తహసీల్దార్ మీసాల దానియేలు అన్నారు. మండల పరిధిలోని గోగులపాడు గ్రామంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉచిత సేవలు అందించడం జరుగుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయా లేదా అని తెలుసుకుని పథకాలు అందని వారి వివరాలు సేకరించి పథకం ఎందుకు అందడం లేదు అన్న విషయాన్ని లబ్ధిదారులకు చెబుతున్నారన్నారు. కార్యాలయంలో గ్రామ సర్పంచ్ నంద్యాల రాములమ్మ రామిరెడ్డి, మరియు సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రం పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు అధికారులు

జగనన్న సురక్షలో 696 ధ్రువీకరణ పత్రాల పంపిణీ

కారెంపూడి : మండలంలోని ఒప్పిచర్ల గ్రామ సచివాలయం-1 పరిధిలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 696 గ్రామ ప్రజల సమస్యలు పరిష్కారమయ్యాయి. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు ప్రజలకు అధికారులు పంపిణీ చేశారు. మొదట జరిగిన గ్రామ సభలో ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జి శ్రీనివాస్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమానికి వచ్చిన ప్రతి అర్జీని తక్షణమే పరిష్కరించి ప్రజలకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు సాయంత్రం 5 గంటల లోపే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇరికెదిండ్ల రమణ కొండలు, ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పంగులూరి చినవెంకటనర్సయ్య, ఎంపీటీసీలు పిన్నెల్లి అనంతరామయ్య, ఇరుకులపాటి శ్రీను, మాజీ సర్పంచ్ రామదేని ఆంజనేయులు, మండల సచివాలయాల కన్వీనర్ అల్లు వెంకటేశ్వరరెడ్డి, ఈఓపీఆర్డీ సత్యప్రసాద్, వివిధ శాఖల అధికారులు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష లక్ష్యం

దుర్గి: సీఎం జగన్ పేద ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని ఆయా పథకాలను పొందని ప్రజలకు చేరువ చేయడమే జగనన్న సురక్ష లక్ష్యం అని ఎంపీపీ ఏసూరి సాయిశంకర్ అన్నారు. సోమవారం ముటుకూరు గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పేద ప్రజల అభ్యున్నతికి దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని అనేక కార్యక్రమాలను మన సీఎం జగన్ చేపట్టడంతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. గత టీడీపీ హయాంలో అనేక సాకులు చూపి పథకాలను ఎగ్గొట్టారన్నారు. కానీ నేడు సీఎం జగన్ ప్రతి ఇంటిని జల్లెడ పట్టి అర్హత ఉన్న లబ్ధిదారులను గుర్తించి పథకాలను అందే విధంగా కృషి చేయాలని ప్రభుత్వ సిబ్బందిని ఆదేశించారని తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయం ఆవరణలో నిర్వహించిన క్యాంపుకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. అర్హత కలిగిన ఆయా లబ్ధిదారులకు 583 ధృవపత్రాలను ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. రమేష్ కుమార్, ఎంపీడీఓ కె సమతా వాణి, సర్పంచ్ గొంది నాసరయ్య, ఎంపీటీసీ పసుపులేటి వెంకటరామయ్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోటకూర నాగేశ్వరరావు, ఏఓ వై అమీర్‌రెడ్డి, పిఆర్ ఏఈ వెలిగొండరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కొల్లి హనుమయ్య, కట్టబోయిన రవి, జాస్తి రామ్మూర్తి, పుట్టా మారుతి, తోటకూర శంకర్, సత్యం, రామిశెట్టి బాబురావు, విఆర్ఓ సునీత, సెక్రెటరీ పి శివశంకర్, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు పలువురు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు సాధించవచ్చు

ఏఓ బ్రహ్మారెడ్డి



మాట్లాడుతున్న ఏఓ బ్రహ్మారెడ్డి

రెంటచింతల: ఖరీఫ్‌సీజన్‌లో రైతులు విత్తన శుద్ధి చేయడంవల్ల అధిక దిగుబడులను సాధించడంతో పాటు పలు ప్రయోజనాలను పొందవచ్చునని ఏఓ బ్రహ్మారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పది లీటర్ల నీటిలో 1.5 కిలోల ఉప్పును కలిపి ఎంపిక చేసుకున్న విత్తనాలను పోయగా నీటిపైన తేలిన తాలువిత్తనాలను తీసివేసి నీటి అడుగున మునిగి ఉన్న గట్టి విత్తనాలను నారు పోసుకోవడానికి వాడుకోవాలన్నారు. కిలో వరి విత్తనానికి ఒక లీటరు నీటిలో 2.5 గ్రాముల కార్బండజిమ్ కలిపి 24గం.ల నానబెట్టిన అనంతరం మరో 20 నుంచి 24గం.ల పాటు మంచినీటిలో విత్తనాన్ని ఉంచి తరువాత నారు మడులలో చల్లుకోవాలన్నారు. విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణ కోసం కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. నారుమడిలో ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వపురుగు సోకకుండా ఉండటానికి మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లేముందు 0.2 శాతం క్లోరిప్రేరిఫాస్ ద్రావణంలో నానపెట్టి చల్లుకోవాలన్నారు. కార్బనిజంతో కలిపి విత్తన శుద్ధిచేసుకోవచ్చన్నారు. ఒక కిలో పత్తి విత్తనానికి 8 గ్రాముల ట్రికో డెర్మావిరిడితో, ఒక కేజీ మిరప విత్తనాన్ని 8 నుంచి 10 ఎంఎల్ గాచో ద్రావణంలో విత్తన శుద్ధి చేయడం మంచిదన్నారు. దీంతో విత్తన శుద్ధిచేసి సాగు చేస్తున్న పంటలకు చీడ, పీడల నుంచి కాపాడుకోవచ్చన్నారు. పత్తి చుట్టూ అంతరపంటగా 4సాళ్లకు ఒక సాలుకు కంది, మినప, పెసర పంటలను సాగుచేసు కోవచ్చునన్నారు. మాగాణి చుట్టు గట్టుపై కందిపంటను రైతులు అంతర పంటగా సాగుచేయడం వలన రైతులకు అదనపు ఆధాయం వస్తుందన్నారు. వ్యవసాయశాఖ కూడా అంతరపంటలను సాగుచేసే రైతులను ప్రోత్సహిస్తుందన్నారు.

జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్షాపై అవగాహన



ధర్మవరంలో నిర్వహించిన రీ సర్వే అవగాహన సదస్సులో పాల్గొన్న ఆర్‌డీఓ అద్దెయ్య

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు రక్ష పథకం రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని గురజాల ఆర్‌డీఓ అద్దెయ్య అన్నారు. సోమవారం ధర్మవరం గ్రామంలో మీ భూమి మా హామీ పై గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి సరైన సర్వేలు లేకుండా ఇప్పటి వరకు కొనసాగుతూ వస్తున్నాయని దీనివల్ల భూ సమస్యలు, ఆక్రమణలు, ఆన్‌లైన్ తప్పులు తదితర సమస్యలు ఉన్నాయని వీటన్నిటికీ పరిష్కారమే రీ సర్వే అని పేర్కొన్నారు. ప్రతి రైతు భూ యజమానులు స్థానిక సిబ్బందిని కలిసి భూమికి సంబంధించి తమ వద్ద ఉన్న ఆధారాలను అందజేయాలని కోరారు. డివిజినల్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వేయర్ జయరాజు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో భూ సర్వేని నిర్వహించి శాశ్వత భూ హక్కు పత్రాలను అందజేస్తామని రైతులకు తెలిపారు. ప్రతి భూ యజమానులు, రైతులు, సర్వేకి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం రమేష్‌కుమార్, మండల సర్వేయర్ రఘుపతి, సర్పంచ్ గంగారపు వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ జానకి రాము, వీఆర్‌ఓ రంగారావు, సెక్రెటరీ, రైతులు పలువురు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో చౌడేశ్వరి మాత జన్మదిన వేడుకలు



ప్రత్యేక అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు



చౌడేశ్వరి అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

రెంటచింతల: స్థానిక బాలవికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సమీపంలో వేంచేసిన చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో, తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో సోమవారం చౌడేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆయా దేవస్థానాల ప్రధాన అర్చకులు అనీల్ కుమార్ శర్మ, ఓరుగంటి మారుతీశర్మల నేతృత్వంలో వేకువజాము నుంచే అమ్మవారికి సుప్రభాత సేవ, వేద పారాయణం, గణపతి పూజ, పుణ్యావాహచనం, పంచామృతాభిషేకాలు, నవగ్రహ మండ పారాధన, సహస్రకుంకుమార్చన, మంత్ర పుష్పం, వేడుకలను కన్నుల పండుగగా జరిపించారు. అమ్మవారికి అలంకరించిన రూ. 12 లక్షల విలువైన 20 కేజీల వెండి తొడుగు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు చౌడేశ్వరీ అమ్మవారి జన్మదిన వేడుకల్లో పాల్గొని బోనాలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. వేడుకలలో పాల్గొన్న వేలాదిమంది భక్తులకు రెండు దేవస్థానాల వద్ద మహాన్నదానం చేశారు. దేవస్థానాలను రంగురంగుల విద్యుత్ తోరణాలతో ముస్తాబ్ చేశారు. దేవస్థానం పెద్దశెట్టి పల్లా వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు శీలం నారాయణ, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చల్లని తల్లి శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో గ్రామస్తులు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. శ్రీ చౌడేశ్వరి మాత జన్మదిన వేడుకలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

లాడ్జీలో అనుమానాస్పద మృతి

నరసరావుపేట టౌన్: అనుమానస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట మండలంలో చెరుకుపాలెం గ్రామానికి చెందిన ఉప్పు యోగయ్య (40) ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీనివాస లాడ్జిలో అనుమానస్పదంగా మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఎన్. వెంకటేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వద్ద లభ్యమైన వైద్యశాల ఓ.పీ షీట్ ఆధారంగా నరసరావుపేటలోని వైద్యశాల్లో చూపించుకునేందుకు పట్టణానికి వచ్చినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు అనుమానస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆదర్శ కాలనీలో అభివృద్ధి పనులు ప్రారంభం




అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ జబ్బార్

పిడుగురాళ్ల: పట్టణ సమీపంలోని ఆదర్శనగర్ కాలనీలో అభివృద్ధి పనులకు వైఎస్సార్ సీపీ సీనియర్‌నాయకులు ఎండీ జబ్బార్ ఆధ్వర్యంలో సోమవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ జబ్బార్ మాట్లాడుతూ గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేదల పక్షపాతిగా గురజాల నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఆదర్శ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడం కోసం నిధులు మంజూరు చేశారు. ఆదర్శనగర్ కాలనీ అభివృద్ధిలో భాగంగా శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రాంతంలో అందరు పేదవాళ్లే నివసిస్తున్నారు కనుక ఇప్పటికే ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఇళ్ల పట్టాలను అందజేశారు. నేడు ఆదర్శ కాలనీలో రోడ్ల విస్తరణ, సైడు కాలువలు, సిమెంట్ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. త్వరలోనే ఆదర్శ నగర్ కాలనీ రూపురేఖలు మారబోతున్నాయని ఎండీ జబ్బార్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొండలు, ఆదర్శ నగర్ కాలనీ వాసులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మంచినీరు

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్‌డీ జానీబాషా



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ లక్ష్మణ్

నరసరావుపేట రూరల్: జలజీవన్ మిషన్ పథకంలో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి సురక్షితమైన మంచినీరు అందించడం జరుగుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్‌డీ జానీబాషా తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామ సచివాలయంలో జలజీవన్ మిషన్ పథకంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిధిగా హాజరైన ఏఈ మాట్లాడుతూ జల జీవన్ మిషన్ పథకంలో గ్రామానికి రూ.58 లక్షలు మంజూరు అయి నట్టు తెలిపారు. ఇంటింటికీ కుళాయి ఇవ్వడంతో పాటు స్వచ్ఛమైన తాగునీటి అందించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని తెలిపారు. స్వయం సహాయక బృందాల పర్యవేక్షణలో జల జీవన్ మిషన్ పనులు నిర్వహించాలని ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించినట్టు తెలిపారు. సదస్సులో గ్రామ సర్పంచ్ వడ్డే మాలశ్రీ, డీపీఎంయు కోఆర్టినేటర్ లక్ష్మణ్, నాగేశ్వర రావు, పంచాయతీ కార్యదర్శి సతీష్, వడ్డే వీరాంజనేయులు, వడ్డే దేశంగరావు, జేజేఎమ్ కోఆర్టినేటర్లు డి.కోటేశ్వరరావు, బాబురావు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించండి

డిప్యూటీ కలెక్టర్ శ్రీరామచంద్రమూర్తి



తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఓటర్ల నమోదు అధికారి, డిప్యూటీ కలెక్టర్

మాచర్ల రూరల్: నియోజక వర్గంలోని ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా తహసీల్దార్లు పని చేయాలని ఓటర్ల నమోదు అధికారి, డిప్యూటీ కలెక్టర్ ఎ శ్రీరామచంద్రమూర్తి కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మాచర్ల, దుర్గి, వెల్దుర్తి, రెంటచింతల, కారంపూడి తహసీల్దార్‌లతో ఓటర్ల జాబితా పై సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు ప్రతి ఇంటికి బూత్ లెవల్ అధికారులు ఓటర్ల జాబితా పై పరిశీలన జరిపి 18 ఏళ్ళు నిండిన వారికి ఓటు హక్కు కల్పించటమే కాకుండా పేర్లలో తప్పులు, ఇంటి పేర్లలో తప్పులు సరిచేయుట, మార్పులు, వలసలు, డబుల్ ఎంట్రీ, చనిపోయిన వారిని గుర్తించి జాబితాలో మార్పులు, చేర్పులు చేయాలని కోరారు. వీటి పై తహసీల్దార్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుపుతూ జాబితా వెల్లడించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమణబాబు, తహసీల్దార్లు షేక్ మహమ్మద్ హుస్సేన్, ఎం రమేష్‌కుమార్, కోటేశ్వరరావునాయక్, శ్రీనివాసరావు, పుల్లారావు, డీటీలు షేక్ బాషా, రాజశేఖర్‌నాయక్, సీనియర్ అసిస్టెంట్ వలి తదితరులున్నారు.

మండల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మబుజ్జి

గురజాల : మండల అభివృద్ధికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మండల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు ప్రతి ఒక్కరం తోడుగా ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఎన్నో అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం గురించి మండల స్థాయి అధికారులు వివరించారు. మండల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. పలు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆమోదం తెలిపారు. ప్రతి ఇంటికి మంచినీటిని అందించాలనే లక్ష్యంతో జల జీవన్ మిషన్ కార్యక్రమం పనులు గ్రామాల్లో జరుగుతున్నాయన్నారు. గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించి గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, ఎంపీడీఓ ఆర్ ఫణికుమార్ నాయక్, కో ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్, ఎంపీటీసీలు తదితరులున్నారు.

పాఠశాలలో తనిఖీ చేసిన ఎంపీడీఓ



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కోటేశ్వరావు, ఎంఈఓ నాగయ్య

విజయపురిసౌత్: మాచర్ల మండలంలోని నాగులవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, విజయపురిసౌత్‌లోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, డాక్టర్‌బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలను ఎంపీడీవో కోటేశ్వరావు, ఎంఈవో వేముల నాగయ్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా నాగులవరం ప్రాథమిక పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి ప్రతి రోజు రుచికరమైన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. అనంతరం విజయపురిసౌత్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో వంటశాలలను తనిఖీ చేసి మెను ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఆయా పాఠశాలల సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాగులవరం పాఠశాల హెచ్‌ఎం శ్రావణి, అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీరాజ్యం, గిరిజన సంక్షేమ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఏ జాన్సన్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగాపురంలో మురుగు తొలగించాలని వినతి



స్పందనలో తహసీల్దార్‌కు అర్జీ అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మాచర్ల రూరల్: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందనకు మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. మండలంలోని లింగాపురం గ్రామంలో ఎస్సీ కాలనీలోని నివాస గృహాల వద్ద మురుగునీరు పారుదల నిలిచిపోయి దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నా అధికారులు స్పందించడం లేదని, వెంటనే తగు చర్య తీసుకోవాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు మాచర్ల విజయకుమార్ కోరారు. పట్టణంలో ఖాళీ స్థలాల్లో చెట్లు పెరిగి దోమలు, ఇతర క్రిమి కీటకాలకు నెలవుగా ఉన్నాయని, వెంటనే చెట్లను తొలగించాలని శ్రీనివాసరెడ్డి కోరగా, జగనన్న కాలనీలో నివాస పట్టాలు అందించాలని కోటమ్మలు అర్జీలు అందజేసినట్లు తహసీల్దార్ తెలిపారు.